క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదన్, చంద్రకాంత్ రెడ్డి

ఆదోని టౌన్: క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ క్రీడా మైదానంలో భీమిరెడ్డి మెమోరియల్ క్రికెట్ కప్–2023 టోర్నమెంట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆసీఫ్‌బాషా, అజీమ్, చాంద్‌బాషా, మన్సూర్‌చాంద్, బాషా, నబి పాల్గొన్నారు.

ఎద్దుల బండిపై నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

ఆదోని అర్బన్: ఆస్పరి మండలం వలగొండ గ్రామానికి చెందిన నరసయ్య బుధవారం ఎద్దులబండి మీద నుంచి కింద పడి తీవ్రగాయాల పాలయ్యాడు. బంధువులు వెంటనే ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇంటి నుంచి పొలానికి వెళ్తుండగా ఎద్దులబండి పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయని,బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి వలంటీర్లకు వందనం

ఆదోని అర్బన్ : వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో గురువారం నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌కేడీ కాలనీలోని పార్క్‌లోగురువారం 12–21వ వార్డు వరకు, 25 – 29వ వార్డు వలంటీర్లను సన్మానిస్తారన్నారు. 27న అండర్‌పేట్ ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 3– 11వ వార్డు, 16వ వార్డు వలంటీర్లకు, 29న జీవేశ్వర ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ఆవరణలో 1, 2, 4, 30 నుంచి 34, 36, 38 నుంచి 42వ వార్డు వలంటీర్లకు, 30న ఆర్‌ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో 22, 23, 24, 35, 37 వార్డు వలంటీర్లకు అవార్డుల కార్యక్రమం ఉంటుందని వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

ముమ్మరంగా ఇళ్ల నిర్మాణం

ఆదోని సెంట్రల్ : పట్టణంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు హౌసింగ్ డీఈ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. 170.81 ఎకరాల్లో 9327 పట్టాలు పంపిణీ చేయగా, అందులో ఫస్ట్ ఫేస్ కింద 5,101 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. అందులో పిల్లర్లు, బీమ్స్ లెవెల్‌లో ఉన్న 2,934 ఇళ్లను జూలై 30లోగా రూఫ్ లెవెల్‌లో తీసుకురావాలని సూచించినట్లు చెప్పారు. బేస్‌మట్టం లెవెల్‌లో ఉన్న 1,483 ఇళ్లను స్లాబ్ లెవెల్‌కి తీసుకురావాలని కోరారు.

సెమిస్టర్ విద్యార్థులకు అవకాశం

ఆదోని సెంట్రల్ : 2016–2019 డిగ్రీ రెగ్యులర్ బ్యాచ్ సెమిస్టర్ విద్యార్థులకు ఒక సబ్జెక్ట్ మిగిలి ఉంటే పరీక్ష రాసుకునేందుకు రాయలసీమ విశ్వవిద్యాలయం అవకాశం కల్పించిందని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.మురళీమోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లింపునకు నెల 31వ తేదీ వరకు గడువుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు స్థానిక కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం

కోసిగి : స్థానిక మౌంట్ కార్మెల్ పాఠశాల క్రీడా మైదానంలో జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రిన్సిపాల్ ఫాదర్ జాన్సన్, నిర్వాహకులు ఆర్గనైజర్స్ శ్రీధర్, వంశీ బుధవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. మొదటి బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేల నగదు అందజేయనున్నట్లు చెప్పారు. నేడు ఫైనల్ ఉంటుందని పేర్కొన్నారు.

క్షయవ్యాధికి ఉచితంగా మందులు

ఆదోని టౌన్ : క్షయ లక్షణాలుంటే అందుబాటులో ఉండే ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకొని నిర్ధారణ అయితే ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని టీబీ యూనిట్ టీం సభ్యులు ఏరియా ఆస్పత్రి డాక్టర్ షేక్ న్‌భాను తెలిపారు. బుధవారం నేషనల్ నర్సింగ్ విద్యార్థులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, ఆరోగ్య కార్యకర్తలతో కలిసి పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ లలితమ్మ, టీబీ హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ, కళాశాల కరస్పాండెంట్ నీలోఫర్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

పెద్దకడబూరు : గ్రంథాలయంలో నిర్వహించే సమ్మర్ క్యాంప్‌ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివలింగమ్మ సూచించారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను బుధవారం పరిశీలించారు. లైబ్రేరియన్ ఆశాజ్యోతి ఉన్నారు.

☛ పట్టణంలోని ఆర్టీసీ శ్రీనగర్ కాలనీలో ఈనెల 18న ఒకేరోజు మూడిళ్లలో చోరీలు జరిగాయి. ఇంటి యజమానులు పెళ్లి, విహార యాత్రలకు మూడు రోజులకు పైగానే వెళ్లారు. వరుసగా ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన ఆగంతకులు చోరీలకు తెగబడ్డారు. విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న జగ్గయ్య ఇంట్లో రూ.30 వేలు నగదు, పది తులాల బంగారు ఆభరణాలు, ఉపాధ్యాయుడు రమేష్‌నాయుడు ఇంట్లో ఆరు తులాల బంగారు ఆభరణాలు, ఒక తులం వెండి, రూ.7 వేలు నగదు, మరో ఉపాధ్యాయుడు సుధాకర్ ఇంట్లో రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు.

☛ తాము మున్సిపల్ ఉద్యోగులమని..వర్షాకాలం వస్తోంది కదా.. డ్రెయినేజీ పైపులు పరిశీలించాలంటూ మెడలో ఐడీ కార్డు వేసుకొని ఇద్దరు దొంగలు పట్టణంలోని అరుంజ్యోతినగర్‌లో ట సంధ్యారాణి ఇంట్లోకి గతేడాది జూలైలో ప్రవేశించారు. ఇంటి ఆవరణలో పైపులను చూపిస్తుండగా ఆమెను మాటల్లో పెట్టారు. ఇంతలో ఇంకొక దొంగ ఇంట్లోకి చొరబడి 12 తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. పని అయిపోగానే తమ సిబ్బంది వచ్చి కొత్త పైపులైన్లు వేస్తారు అని చెప్పి ఉడాయించారు.

☛ ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న శ్రీరామనగర్ కాలనీలో వృద్ధ దంపతులు వెంకటరెడ్డి, జయలక్ష్మి నివాసముంటున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 25న సాయంత్రం భార్య బయటికి వెళ్లడంతో, భర్త వాకింగ్‌కు వెళ్లేందుకు ఇంటికి తాళం వేసి బయట ఉన్న రెండు కుర్చీల మధ్య తాళం పెట్టి వెళ్లాడు. వాకింగ్ ముగించుకొని భర్త, బయటకెళ్లిన భార్య ఇద్దరూ ఒకేసారి తిరిగొచ్చారు. తాళం తీసి లోపలికెళ్లగా బీరువా పగులగొట్టి ఉండటంతో పరిశీలించగా.. 12 తులాల బంగారం ఆభరణాలు, రూ.5,500 నగదు అపహరణకు గురైందని గుర్తించి బోరుమన్నారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!

- పోలీసులకు సమాచారమిస్తే గస్తీ ఏర్పాటు
- విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఇంట్లో ఉంచుకోవద్దు
- సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ
- డీఎస్పీ శివనారాయణస్వామి



శ్రీనగర్ కాలనీలో జరిగిన చోరీలో ఓ ఇంట్లో చెల్లాచెదరుగా పడి ఉన్న వస్తువులు (ఫైల్)

ఆదోని అర్బన్ : ఊరెళ్లే హడావుడిలో చాలామంది ఇంటి భద్రతను పట్టించుకోరు. ఇదే అదునుగా దొంగలు తమ పని కానిచ్చేస్తున్నారు. సెలవుల్లో పండగలు, పబ్బాలు, యాత్రలు, శుభకార్యాలు, బంధువుల ఇళ్లకు వెళ్లే వారు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిందేనని పోలీసులు పేర్కొంటున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న ఇంటిని గుల్ల చేసే ఆస్కారం ఉన్నందున ప్రతిఒక్కరు జాగ్రత్తలతో పాటు సమాచారాన్ని సమీప పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలంటున్నారు. ఇటీవల తాళాలు వేసిన ఇళ్లతో పాటు మనుషులు ఉన్న ఇళ్లలోనూ ఉద్యోగులమంటూ తాగేందుకు నీరు ఇవ్వాలని, ఫొటోలు తీసుకుంటామని కొంతమంది దొంగలు ప్రణాళికలతో వచ్చి చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. శివారు ప్రాంతాలైతే అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిందేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

పట్టణంలో ఎల్‌హెచ్‌ఎంఎస్ పనీ చేయడం లేదు..

లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా ఇంటికి రక్షణగా పోలీసు సాయం సులభంగా తీసుకోవచ్చు. దీనిని ఫోన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఊరికి వెళ్లే సమయంలో సమాచారమిస్తే పోలీసులు ఇంట్లో కెమెరాను బిగిలించి వెళ్తారు. ఇంట్లో దొంగ పడితే కదలికలను కంట్రోల్ రూమ్‌లోకి లైవ్ కనిపిస్తుంది. దీంతో దొంగను ఇట్టే పట్టిచ్చేస్తుంది. ఈ పద్ధతి పట్టణంలో 2017లో 13 కెమెరాలతో ప్రారంభమై ఏడాది పాటు పని చేసింది. ఆ తర్వాత కెమెరాలు పనిచేయక పోవడం, ఇప్పటివరకు మరమ్మతులకు నోచుకోలేకపోవడంతో ప్రస్తుతం అందుబాటులో లేదు.

దొంగతనాలు, రికవరీలు..

2022మార్చి నుంచి ఈ ఏడాది మార్చి వరకు నియోజకవర్గంలో ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 47 దొంగతనాలు జరిగాయి. రూ.1,96,23,207 ప్రాపర్టీని దొంగలు దొంగలించారు. పోలీసులు ఇందులో 44 కేసులను ఛేదించారు. రూ.1,85,27,310 విలువ గల ప్రాపర్టీని స్వాధీనం చేసుకొని కోర్టు ద్వారా బాధితులకు అందజేశారు. అంతేగాకుండా ఈ ఏడాది ఆరు దొంగతనాల్లో రూ.15.44 లక్షలు దొంగలించారు. ఇందులో నాలుగు కేసులను ఛేదించగా, రూ.12.75 లక్షల ప్రాపర్టీని కోర్టు ద్వారా తిరిగి అప్పగించారు.

పోలీసుల సూచనలు..

➡ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే ఆ ఇంటి వద్ద పోలీసులు రక్షణ ఉంటుంది.

➡ ద్విచక్ర వాహనాలను ఇంటి ఆవరణలో పార్కు చేసి లాక్ చేస్తే దొంగతనానికి ఆస్కారం ఉండదు.

➡ దొంగ, దొంగలించిన సొమ్ము దొరకాలంటే ఇంట్లో సీసీ కెమెరాలు అమర్చుకొని వాటిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, దొంగ కదలికలను పోలీసులకు సమాచారమివ్వాలి.

➡ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం తాళం అమర్చుకుంటే తాళాన్ని పగలగొట్టే ఆస్కారం ఉండదు, పగలగొట్టినా పక్క వారికి సౌండ్ వినిపిస్తుంది.

➡ దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

➡ నమ్మకస్తులను సెక్యూరిటీ గార్డులుగా పెట్టుకోవాలి

లాకర్లలో భద్ర పరుచుకోవాలి



ప్రజలు విలువైన బంగారం, నగదును లాకర్లలో గానీ, బంధువుల వద్ద గానీ భద్రపరుచుకోవాలి. ఇళ్లు,, దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. పట్టణంలో 51 సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇక నాలుగు పాయింట్లలో 8 హైక్వాలిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాం. దొంగతనాల నివారణకు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశాం. రాత్రి వేళల్లో విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. ఊరు వెళ్లేవారు దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి వెళ్లాలి.

– శివనారాయణస్వామి, డీఎస్పీ

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న ఆంజనేయ స్వామి

ఆదోని అర్బన్ : పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన వెలిసిన శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ 33వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచి స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, వెండి, పూల అలంకరణ, నైవేద్యం,మహామంగళ హారతి కార్యక్రమాలు చేపట్టా రు.అనంతరం గణపతిపూజ, హోమం, మధ్యా హ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో రథోత్సవం జరిపించారు. సారస్వత అవార్డు గ్రహీత విద్వాన్ సుస్వరం నాగరాజు ఆచారి శ్రీ హనుమత్ వైభవంపై ప్రసంగించారు. టూటౌన్ ఎస్‌ఐ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహం అడ్డగింత

ఆదోని రూరల్ : మండలంలోని జాలిమంచి గ్రామంలో బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. జాలిమంచి గ్రామానికి చెందిన బాలికను ఎమ్మిగనూరు మండలం నాగలాపురం గ్రామానికి చెందిన ఇజ్రాయిల్, సువార్తమ్మ దంపతుల కుమారుడు దేవదానంకు ఇచ్చి వివాహం జరిపించేందుకు నిశ్చితార్థం జరిపారు. అయితే గురువారం ఉదయం వివాహం జరిపించాల్సి ఉండటంతో బుధవారం సాయంత్రం నాగలాపురం వెళ్తుండగా కొందరు గ్రామస్తులు ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశారు. దీంతో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, ఎస్‌ఐ చంద్ర, ఏఎస్‌ఐ మోహన్‌కృష్ణ, పెద్దతుంబళం హెడ్‌కానిస్టేబుల్ గోపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి జాలిమంచి గ్రామానికి వెళ్లి వివాహాన్ని అడ్డుకున్నారు. ఓ దశలో తల్లిదండ్రులు, గ్రామస్తులు అధికారులపై తిరగబడ్డారు. బాల్యవివాహం చేయడం నేరమని తల్లిదండ్రులకు నచ్చజెప్పినప్పటికీ తమకు గిట్టని వారు ఇలా చేశారని తల్లిదండ్రులు వాపోయారు.

గ్రామ స్వరాజ్యమే ప్రభుత్వ ధ్యేయం



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

- వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం
- ఎల్లో మీడియా అసత్య ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారు
- పవన్‌కళ్యాణ్, లోకేష్ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు
- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని రూరల్: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సన్మానించి, పురస్కారాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనను చూసి దేశమంతా రాష్ట్రం వైపు చూస్తుందన్నారు. టీడీపీ పాలనలో నెల ప్రారంభమై వారం రోజులైనా పింఛన్ అందని పరిస్థితి ఉండేదని, క్యూలో గంటల తరబడి నిలబడి తీసుకునేవారని గుర్తు చేశారు. నేడు ఆ పరిస్థితి లేదని, తెల్లవారక ముందే లబ్ధిదారులకు సొమ్ము అందజేస్తున్నారని చెప్పారు.

నా మాటలను వక్రీకరించారు..

ఎల్లో మీడియా అసత్య ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారని, వాటికి విలువ లేకుండా పోయిందని ఎమ్మెల్యే అన్నారు. లేనిపోని వాటిని సృష్టించి అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల తాను జగనన్నే మా నమ్మకం కార్యక్రమంలో భాగంగా ఆరేకల్ గ్రామానికి వెళ్లినప్పుడు మరింత మెరుగైన పాలన అందించేందుకు జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని చెబితే.. ఆ మాటలను ఎల్లో మీడియా వక్రీకరించి ప్రచారం చేసిందని అసహనం వ్యక్తం చేశారు. వాస్తవాలను ప్రచారం చేస్తేనే మీడియాకు విలువుంటుందని, లేకపోతే పత్రికలు, టీవీలు మానుకొని రాజకీయాల్లోకి రావాలని సూచించారు.

పవన్, లోకేష్‌లను ప్రజలు నమ్మరు

ప్రజల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మంచి గుర్తింపు ఉందని, మళ్లీ ముఖ్యమంత్రిగా గెలుపొందడం ఖాయమన్నారు. పవన్‌కళ్యాణ్, నారా లోకేష్ ప్రసంగాలకు జనం కరువయ్యారని, అభివృద్ధిని ఓర్వలేక వారు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సేవావజ్ర అవార్డు పొందిన బల్లేకల్ గ్రామానికి చెందిన పల్లెపాటి రామలక్ష్మి, పెద్దహరివాణం గ్రామానికి చెందిన బోయ ఉల్లెప్ప, మండలంలో సేవారత్న అవార్డులు పొందిన దొడ్డనగేరి గ్రామాలకు చెందిన రమేష్, వీరభద్ర, జయసింహాగౌడ్, బైచిగేరికి చెందిన రంగన్న, ఇస్వీ గ్రామానికి చెందిన గూళ్యమ్మలను సత్కరించారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 429 మంది వలంటీర్లకు సేవామిత్ర నగదు అందజేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎంపీపీ దానమ్మ, మాజీ ఎంపీపీ బడాయి పంపాపతి, ఎంపీడీఓ గీతావాణి, ఎంఈఓ శివరాములు, నాయకులు శేషిరెడ్డి, గురునాథ్‌రెడ్డి, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి

- ప్రతి పథకం అర్హులకు అందాలి
- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

కౌతాళం: గ్రామ వలంటీర్లు బాధ్యతాయుతంగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వలంటీర్లుకు సేవ పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పేదలకు చేరవేయడంలో వలంటీర్లదే ప్రధాన పాత్ర అని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేసే బాధ్యత వారిదేనన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థపై ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, ఆ నమ్మకానికి అనుగుణంగా నడుచుకోవాలని ఆదేశించా రు.లోకేష్ పాదయాత్రతో ఒరిగేదేమిలేదన్నారు. దిక్కుతోచని స్థితిలో చంద్రబాబు, లోకేష్ ఉండిపోయారన్నారు. జెడ్పీటీసీ రాధప్రియదర్శిని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాట్ల కృష్ణంరాజు, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, సర్పంచ్ పాల్‌దినకర్, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ విజయ్‌శేఖర్, తహసీల్దారు రామేశ్వర్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి శేషాద్రి పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ యంత్రసేవ పథకం కింద మంజూరైన రెండు ట్రాక్టర్లను మండల కేంద్రానికి చెందిన చరిత, రాజానగర్ రైతు మిత్ర గ్రూపులకు పంపిణీ చేశారు.

ఉన్నతికి దీవెన

- తల్లుల ఖాతాలో విద్యాదీవెన నగదు జమ
- మంత్రాలయంలో 2,882 విద్యార్థులకు రూ.1.77 కోట్లు
- ఆదోనిలో 3,153 మంది విద్యార్థులకు రూ.2.44 కోట్లు విడుదల



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

మంత్రాలయం: పేద విద్యార్థుల ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసింది. జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు వరంగా మారాయి. ఐటీఐ, డిగ్రీ, పాల్‌టెక్నిక్, బీటెక్ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మంజూరు చేశారు.

రూ.4.22కోట్లు మంజూరు :

విద్యా దీవెన పూర్తి రీయింబర్స్‌మెంట్ కింద మంత్రాలయం నియోజకవర్గానికి రూ.1.77 కోట్లు, ఆదోనికి రూ.2.44 కోట్లు మంజూరైంది. మంత్రాలయంలో మొత్తం 2,882 మంది విద్యార్థులకు గానూ 2,667 మంది తల్లుల ఖాతాలో నగదు జమ చేశారు. ఆదోనిలో 3,153 మంది విద్యార్థులకుగానూ 2,891 మంది తల్లుల ఖాతాలో రూ.2.44 కోట్లు వేశారు. రెండు నియోజకవర్గాలకుగానూ రూ.4.22 కోట్లు విడుదలయ్యాయి.

మంత్రాలయం నియోజకవర్గంలో...

మండలం	విద్యార్థులు	తల్లిదండ్రులు	మంజూరైన నిధులు
మంత్రాలయం	818	751	రూ. 53,75,148
పెద్దకడబూరు	494	463	రూ. 32,40,577
కౌతాళం	768	717	రూ. 45,57,343
కోసిగి	802	736	రూ.46,12,490
మొత్తం	2,882	2,667	రూ.1,77,85,558

ఆదోని నియోజకవర్గంలో..

మండలం	విద్యార్థులు	తల్లిదండ్రులు	మంజూరు నిధులు
ఆదోని రూరల్	1,106	1,024	రూ.79,72,398
ఆదోని అర్బన్	2,047	1,867	రూ.1,64,72,103
మొత్తం	3,153	2,891	రూ.1,24,44,501

మూడేళ్ల నుంచి వస్తోంది



మాది కోసిగి మండల కేంద్రం. నేను తిరుపతిలోని గోవిందరాజుల ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బీకాం కంప్యూటర్స్ ఫైనలియర్ చదువుతున్నా. మూడేళ్ల నుంచి నాకు విద్యాదీవెన నిధులు వచ్చాయి. మా అమ్మానాన్నలకు భారం లేకుండా నా చదువు కొనసాగడానికి దీవెన డబ్బు దోహదపడింది.

– గంగిరెడ్డి, కోసిగి

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



మాది కౌతాళం మండలం రౌడూరు గ్రామం. నా కుమారుడు గంగన్న బీకాం కంప్యూటర్ అప్లికేషన్ కోర్సు రెండో సంవత్సరం పూర్తి చేశాడు. రెండేళ్లుగా నా కుమారుడికి విద్యా దీవెన సొమ్ము వచ్చింది. ఈ పథకం ఎంతో మా వాడి చదువుకు సాయంగా నిలిచింది. ప్రైవేటు కళాశాల ఫీజులు చెల్లించాలంటే కష్టంగా ఉండేది. ఈ పథకం ప్రవేశపెట్టి ఎంతో మేలు చేశారు.

– మారెమ్మ, కౌతాళం

జోరుగా అభివృద్ధి పనులు

కోసిగి: మండలంలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం కింద చేపట్టిన అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ యుగంధర్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక నాడు గేని వీధిలో సచివాలయం–3 కింద రూ.10లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులను నాణ్యతను ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో కలిసి పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ మండలంలోని సాతనూరులో రూ.15లక్షలతో 215 మీటర్లు డ్రైనేజీ,సీసీ రోడ్డు, తుంబిగనూరులో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు వేయించినట్లు చెప్పారు. అలాగే అగసనూరులో రూ.12లక్షలతో నేలకోసిగిలో రూ.10 లక్షలతో,కోసిగి–1 పరిధిలో దొరలచావిడి నుంచి కట్టలగేరి యల్లయ్య ఇంటి వరకు రూ.10లక్షలతో, సచివాలయం–2 పరిధిలో కొత్తపేట కాలనీకి రూ.8 లక్షలతో, సచివాలయం–3 పరిధిలో రూ.10లక్షలతో, మరో రూ.10లక్షలతో శ్మశాన వాటిక డ్రైనేజీ, సీపీ రోడ్ల పనులు పూర్తి చేశారు.వందగల్లులో రూ.10 లక్షలతో తాగు నీటి పైప్‌లైన్ పనులు చేపడుతున్నారని వివరించారు.

రైళ్లపై రాళ్లు విసిరితే జైలు శిక్ష

ఆదోని టౌన్: పట్టణంలో రైళ్ల రాకపోకల సమయంలో రాళ్లు విసురుతూ అల్లర్లకు పాల్పడితే జైలుశిక్ష తప్పద ని రైల్వే ఎస్‌ఐ రామస్వామి హెచ్చరించారు. బుధ వారం సాయంత్రం భీరప్పనగర్, మేదర్‌గేరి ప్రాంతా ల్లోని యువతకు వివిధ కల్యాణ మండపాల నిర్వాహకులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఇటీవల భీరప్పనగర్, రాయనగర్ మధ్య రైళ్లపై కొందరు యు వకులు రాళ్లు విసురుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి చర్యలు మానుకోవాలని సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ఆదోని సెంట్రల్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌ఐఓ గురువయ్యశెట్టి తెలిపారు.

మంత్రాలయం : ఇంటర్మీడియెట్ సప్లమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీమఠం పరిమళ విద్యా నిలయంలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాల్లో 110 మంది విద్యార్థులు పరీక్షలకు హాజయ్యారు. సీఐ శ్రీనివాసులు బందోబస్తు పర్యవేక్షించారు.

కోసిగి: స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమైయ్యాయి. పరీక్షల చీఫ్ శ్రీనివాసులు, డిపార్ట్‌మెంట్ అధికారి రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ప్రశాంతం జరిగాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్ట్ ఇయర్ పరీక్షకు 168 మంది విద్యార్థులకు గానూ 149 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు సెకెండియర్ పరీక్షలకు 151 మందికి గానూ 123 మంది హాజరైనట్లు తెలిపారు.

కౌతాళం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం 48మంది విద్యార్థులకు గాను 32మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 24మందికి గాను 9మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన చెప్పారు.

నేటి నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం'

కౌతాళం: నదిచాగి గ్రామ మజరా అయిన మేళిగనూరులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ విజయ్‌శేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రజలకు పథకాలు, పాలన తీరును వివరించి సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమాన్ని మూడు రోజులు పాటు నిర్వహిస్తున్నామని, 26,27 తేదీల్లో నదిచాగిలో ఉంటుందని వివరించారు.